క్లుప్తంగా

కేంద్ర బృందం పర్యటన

గూడూరు: మండలంలోని గండ్రం, తుమ్మల పాలెం గ్రామాల్లో కేంద్రబృందం శుక్రవారం పర్యటించింది. నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీం గ్రామ సభలు నిర్వహించి ప్రజల నుంచి వివరాలు నమోదు చేసుకున్నారు. రెండేళ్లుగా గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలలో 12 శాఖల ద్వారా జరిగిన పనులపై ఆరా తీశారు. ఆయా గ్రామాల సర్పంచులు గుడివాడ సుబ్రహ్మణ్యేశ్వరరావు, కోడే రేణుకాదేవి, ఎంపీడీఓ డి.సుబ్బారావు, కేంద్ర బృందం ప్రతినిధులు పైడి రాజు, విజయ్, డీఆర్‌డీఏ డీపీఎం గోవిందరాజు, డ్వామా ఏపీడీ శ్రీలత పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

చిలకలపూడి(మచిలీపట్నం): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బందరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ కార్యకర్తలు, సహాయకుల పోస్టుల భర్తీకి బందరు ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 32 పోస్టులకు గాను 75 దరఖాస్తులు వచ్చాయని ఆర్డీఓ తెలిపారు. అవనిగడ్డ, మొవ్వ, బంటుమిల్లి, బందరు రూరల్, బందరు, పెడనలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. బందరు ఆర్డీఓ ఐ. కిషోర్, ఐసీడీఎస్ పీడీ ఎస్. సువర్ణ, అధికారులు పాల్గొన్నారు.

నేడు ప్రజావేదిక

పెడన: ఉపాధి హామీ పనులకు సంబంధించి మండలంలో ఇప్పటికే గ్రామ సభలు పూర్తయిన నేపథ్యంలో శనివారం ఉదయం పది గంటలకు ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీఓ డి. సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 ఏడాదికి సంబంధించి జరిగిన పనులపై ఆడిట్ అభ్యంతరాలు ఉంటే వాటిని ప్రజావేదికలో తెలియజేస్తాలని చెప్పారు. సంబంధిత ఎస్‌ఆర్‌ఈజీఎస్ ఉద్యోగులు, సిబ్బంది, అనుబంధ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

మచిలీపట్నం ఎస్‌ఐగా రమేష్‌బాబు

కోనేరుసెంటర్: మచిలీపట్నం పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా దోనేపూడి రమేష్‌బాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కాకినాడ జిల్లా కరప స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న రమేష్‌బాబు గురువారం మచిలీపట్నం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కాగా ఎస్పీ పి. జాషువా ఆదేశాల మేరకు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన ఎస్పీ జాషువా, ఏఎస్పీ వెంకట రామాంజనేయులును కలుసుకున్నారు.

ప్రతిభ పురస్కారాలు ప్రదానం

పెడన: గణతంత్ర దినోత్సవం సందర్భంగా పెడన హౌసింగ్ డీఈ ఎ. శ్రీనివాసరావు, మచిలీపట్నం జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో సీ సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ మలిశెట్టి వెంకటేశ్వరరావుకు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలు అందజేశారు. వీరిని పలువురు అభినందించారు.

రబీ ఈక్రాప్ నమోదు తనిఖీ

పెడన: మండలంలో రబీ ఈ క్రాప్ నమోదు విధానాన్ని ప్రత్యేకాధికారి, వయోజన విద్యా శాఖ డెప్యూటీ డైరెక్టర్ ఎండీ హాజీబేగ్ పరిశీలించారు. ఉరివి, కమలాపురం, శేరివత్తర్లపల్లి, ముచ్చలిగుంట, బల్లిపర్రు, కొంకేపూడి, నడుపూరు, కొప్పల్లి గ్రామాల్లో పర్యటించి ర్యాండమ్‌గా ఇచ్చిన ఈ క్రాప్ అయిన పంటలను పరిశీలించారు. ఈ క్రాప్ నమోదులో ఏ పంట వేశారు, ఎంత విస్తీర్ణంలో పంట ఉంది తదితర వివరాలను ఈక్రాప్‌లో నమోదైన వివరాలతో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏఓ జీవీ శ్రీనివాసరావు, వీఏఏలు పూజిత, వెంకట్రావు, వీఆర్వో గణేష్, రైతులు పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామి వ్రతం

మచిలీపట్నంటౌన్: స్థానిక ఆజాద్‌రోడ్డులోని కన్యకాపరమేశ్వరి దేవాలయం ఆవరణలో నిర్మించిన నూతన వ్యాపార సముదాయ గృహ ప్రవేశ కార్యక్రమం శుక్రవారం జరిగింది. రమాసహిత సత్యనారాయణస్వామి నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

బంటుమిల్లి: మల్లపరాజుగూడెంలో పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడి చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం పోలీసులు దాడి చేసి ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 7,110 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

మహిళ ఆత్మహత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

పెడన: పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేయడంతో తీవ్ర మనస్తాపంతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన దివ్యశ్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిన్నం కిషోర్‌ను శుక్రవారం పెడన పోలీసులు అరెస్ట్ చేశారు. గాయంపాడు గ్రామానికి చెందిన మహిళకు 2017లో వివాహమైంది. భర్త గుండె జబ్బు ఉన్నట్లు తెలిసి వివాహమైన ఆరు నెలలకు విడాకులు తీసుకుంది. అనంతరం గాయంపాడులోని చిన్నం కిషోర్‌తో ప్రేమలో పడటంతో లోబరుచుకున్నాడు. పెళ్లి చేసుకోవాలని దివ్యశ్రీ ఒత్తిడి చేయడంతో పాటు పెద్దల సమక్షంలో చేసిన ప్రయత్నాలు ఫలించ లేదు.మనస్తాపంతో దివ్యశ్రీ ఈ నెల 24న పురుగుమందు తాగింది. మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి చికిత్స పొందుతోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడు కిషోర్‌ను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. కిషోర్‌కు రిమాండ్ విధించడంతో మచిలీపట్నం సబ్‌జైలుకు తరలించారు.

పథకాల అమలులో దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం

చిరువోలు(మోపిదేవి): సంక్షేమ పథకాల అమలులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మెరకనపల్లి పరిధిలోని మక్తాలంక, చిరువోలు, శీలంవానిగూడెంలో శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సింహాద్రి వికాస్‌బాబుతో కలిసి ఎమ్మెల్యే 503 గృహాలను సందర్శించి ప్రభుత్వ పథకాలను వివరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేకు ఇంటింటా అపూర్వ స్వాగతం లభించింది. అడగకుండానే అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, పేదలకు పింఛన్లు ఇచ్చారని, పేదల సొంతింటి కల నేర



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

వేర్చుతున్న జగనన్న ప్రభుత్వానికి అండగా ఉంటామని మహిళలు ఎమ్మెల్యే సింహాద్రితో అన్నారు. గ్రామంలో అంతర్గత రహదారులు, కుళాయి నీరు అందించాలని కోరారు. కరకట్ట దిగువ లే అవుట్స్‌ను గత ప్రభుత్వం సీఆర్‌జెడ్‌లోకి తీసుకురావడంతో ఆలస్యమైందని, దీన్ని కూడా త్వరలోనే పరిష్కరించి లబ్ధిదారులకు అందజేస్తామని చెప్పారు. కరోనా సమయంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, నవరత్నాల ద్వారా సంక్షేమ పథకాలు అందించి దేశంలోనే మన రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు. జగనన్నను మరోసారి దీవించి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. సర్పంచ్ యర్రంశెట్టి ధనరాజ్యలక్ష్మి, ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్‌బాబు, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ యర్రంశెట్టి రాంబాబు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు ముత్యాల వరలక్ష్మి, అరజా లక్ష్మీతులసి, రెడ్రౌతు వెంకట రమణ, రావి రామప్రసాద్, ఆది రాంబాబు, లింగం జగదీష్‌కుమార్, బండారు సూరిబాబు, మోర్ల శ్రీనివాసరావు, ముత్యాల గోపాలరావు, కామిశెట్టి వెంకట సురేష్‌బాబు పాల్గొన్నారు.

వెణుతురుమిల్లిలో హర్షాతిరేకాలు

చల్లపల్లి(అవనిగడ్డ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టుకు నూతన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ వెణుతురుమిల్లి గోపాలకృష్ణారావు స్వగ్రామం చల్లపల్లి. తమ గ్రామానికి చెందిన గోపాలకృష్ణారావు హైకోర్టు జడ్జిగా నియమితులు కావటంతో చల్లపల్లి ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. చల్లపల్లికి చెందిన విశ్రాంత సబ్ రిజిస్ట్రార్ వెణుతురుమిల్లి సోమయ్య – కోటేశ్వరమ్మ కుమారుడు గోపాలకృష్ణారావు. చల్లపల్లిలో పుట్టి పెరిగిన గోపాలకృష్ణారావు 1977–78 వరకు హైస్కూల్ విద్యాభ్యాసం, 1978–80లో ఇంటర్మీడియెట్ స్థానిక ఎస్‌ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాలలో అభ్యసించారు. మచిలీపట్నం, తదితర ప్రాంతాల్లో ఉన్నత విద్య అభ్యసించారు. న్యాయవాద విద్యను అభ్యసించిన గోపాలకృష్ణారావు అవనిగడ్డ బార్ అసోసియేషన్‌లో సభ్యులై ప్రాక్టీస్ ప్రారంభించారు. 1990లో అవనిగడ్డకు చెందిన ప్రముఖ న్యాయవాది మత్తి వెంకటేశ్వరరావు వద్ద జూనియర్‌గా చేరి నాలుగేళ్లు న్యాయవాదిగా పనిచేశారు. ఆ తర్వాత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఇటీవల గుంటూరులో ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జిగా పని చేస్తూ కొలీజియం సిఫార్సు మేరకు కేంద్ర ప్రభుత్వ ఆమోదంతో ఏపీ హైకోర్టుకు అదనపు న్యాయ



హైకోర్టు వద్ద గోపాలకృష్ణారావును సత్కరిస్తున్న మత్తి వెంకటేశ్వరరావు

మూర్తిగా నియమితులై బాధ్యతలు చేపట్టారు. జస్టిస్ గోపాలకృష్ణారావు కుమారుడు రఘు నాథ్ రాష్ట్ర స్థాయిలో ఏడో ర్యాంక్ సాధించి జూనియర్ సివిల్ జడ్జిగా నియమితులై ఆత్మకూరులో విధులు నిర్వర్తిస్తున్నారు. చల్లపల్లి రజక రామాలయం పక్కనే గోపాలకృష్ణయ్య నివసించిన గృహం నేటికీ ఉంది. సోదరుడు వి.వి.వి. ప్రసాద్ గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నారు. గోపాలకృష్ణ నియామకంపై ఆయన మేనమామ, విశ్రాంత ఎస్‌ఐ లంక రవీంద్ర, ఆయన స్నేహితుడు చల్లపల్లి వెంకటేశ్వరరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా రథోత్సవం

మోపిదేవి: దేదీప్యమానంగా వెలుగొందుతూ సాగిన రథోత్సవాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు శుక్రవారం ప్రారంభించారు. వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 8.30 గంటలకు వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్ల రథోత్సవం జరిగింది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రథం లాగి స్వామివార్లను దర్శించుకున్నారు. గురువారం రాత్రి స్వామివార్ల కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. చల్లపల్లి ఎస్టేట్ పరిధిలోని ఆలయాల అధికారులు, వేద



రథంపై ఊరేగుతున్న స్వామి వార్లు

పండితులు, అర్చకులు, వేలాదిమంది పాల్గొన్నారు.

పథకాలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యం

కోనేరుసెంటర్: ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువ అయ్యేలా కన్వీనర్లు పనిచేయాలని వైఎస్సార్ సీపీ బందరు నియోజకవర్గ కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్ అన్నారు. బందరు మండలం పెదపట్నం గ్రామంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్లు, గృహ సారథుల ఎన్నిక నిర్వహించారు. గ్రామంలోని ఐదుగురుని గ్రామ కన్వీనర్లుగానూ, 24 మందిని గృహ సారథులుగాను ఎన్నుకున్నారు. రవిశంకర్ మాట్లాడుతూ అర్హులైన వారికి ప్రభుత్వ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బందరు నియోజకవర్గానికి కన్వీనర్‌గా ఎన్నికైన రవిశంకర్‌ను గ్రామ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గడిదేశి రాజు ఆధ్వర్యంలో సన్మానించారు. కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్, గోకవరం పీఏసీఎస్ అధ్యక్షుడు గడిదేశి బాలజీసు, ఉప సర్పంచ్ బోయిన సాయి, నాయకులు పాల్గొన్నారు.

కోసూరువారిపాలెంలో బాబీసింహా సందడి

కోసూరువారిపాలెం(మోపిదేవి): దశాబ్దాల తరువాత స్వగ్రామం కోసూరువారిపాలెంలో హీరో బాబీ సింహా శుక్రవారం సందడి చేశారు. కోసూరు వారిపాలెంలో వారి బంధువులు కోసూరు ఆనంద్ కృష్ణ ఇంటికి ఆయన వచ్చారు. శుక్రవారం ఉదయం మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం స్వగ్రామానికి కుటుంబ సమేతంగా విచ్చేశారు. ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎడ్లబండిపై ఊరేగింపుగా తోడ్కొని వచ్చారు. సర్పంచ్ కోసూరు అనూష, ఎంపీటీసీ సభ్యులు సనకా వెంకట రాజేష్‌బాబు శాలువా కప్పి సన్మానించారు. యువకులు బాబీ సింహాతో సెల్ఫీలు దిగారు. గతంలో కన్నడ, తమిళ, తెలుగు సినిమాల్లో ఆయన నటించారు. ఇటీవల



హీరో బాబీసింహాను సన్మానిస్తున్న సర్పంచ్ అనూష, ఎంపీటీసీ వెంకట రాజేష్‌బాబు

వాల్తేరు వీరయ్య సినిమాలో ప్రతినాయకుడి పాత్రలో మెప్పించారు. మరిన్ని సినిమాలు చేసి గ్రామానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకు రావాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

గ్రీన్ డీజిల్ వినియోగం మంచిది

నాగాయలంక: గ్రీన్ డీజిల్ వినియోగం హానికర వ్యర్థాలను తగ్గిస్తుందని ఇండియన్ ఆయిల్ సంస్థ విజయవాడ డివిజినల్ చీఫ్ మేనేజర్ ఎ.అనిల్‌కుమార్ అన్నారు. ఇటీవల నూతనంగా ప్రవేశపెట్టిన ఎక్స్‌ట్రా గ్రీన్ డీజిల్ వినియోగ విభాగాన్ని స్థానిక వాసవీ సర్వీస్ స్టేషన్ (పెట్రోల్ బంకు)లో శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీజిల్ వినియోగదారులకు అవగాహన కల్పించారు. గ్రీన్ డీజిల్ అధిక ఉత్పాదకశక్తిని ఇస్తోందని, ఇంధన వినియోగ సామర్థ్యం 5–6 శాతం మేరకు పెంచుతుందని వివరించారు. సంస్థ కృష్ణా జిల్లా అసిస్టెంట్ మేనేజర్ బలగా రాజీవ్‌కుమార్, డీలర్ పావులూరి గోపాల కృష్ణమూర్తి, తేజ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వంట పాత్రలు అందజేత

బంటుమిల్లి: ములపర్రు పంచాయతీ శివారు రామన్నమోడి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలకు సర్పంచ్ బొడ్డు మంగమ్మ రూ. 5వేల విలువ చేసే వంట పాత్రలను శుక్రవారం అందజేశారు. ఎంఈఓ కేఎస్‌వీ ప్రసాద్, హెచ్‌ఎం కె. భవానీ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

చల్లపల్లి: మండల ఆర్యవైశ్య మహిళా విభాగ్ నూతన అధ్యక్షురాలిగా వరదా నాగమణి ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక ఆర్యవైశ్య సంఘ భవనంలో మహిళా విభాగ్ వార్షికోత్సవం, నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ప్రధాన కార్యదర్శిగా వేముల అనూష, ఉపాధ్యక్షురాలిగా తూనుగుంట్ల నాగశ్రీదేవి, సహాయ కార్యదర్శిగా కొత్తమాసు నిఖిల, ట్రెజరర్‌గా ఉరిమి దీప్తి, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

గృహ సారథులను ఎంపిక చేయండి

కొత్తమాజేరు (చల్లపల్లి): వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా గృహ సారథుల ఎంపిక వేగవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి ఇంకొల్లు శేషగిరిరావు కోరారు. శుక్రవారం కొత్తమాజేరు పంచాయతీ కార్యాలయంలో గ్రామ సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

గొరిపర్తి మృతికి పలువురి సంతాపం

గూడూరు: గూడూరు గ్రామానికి చెందిన ఆదర్శ రైతు, పద్మశ్రీ పురస్కార గ్రహీత గొరిపర్తి నరసింహరాజు యాదవ్ మృతికి పలువురు సంతాపం తెలిపారు. ఆయన భౌతికకాయాన్ని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఉప్పాల రాంప్రసాద్, గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గొరిపర్తి రవికుమార్, మోటేపల్లి రత్నారావు, లింగం విజయ్‌కుమార్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

బాధితుడికి సాయం

వెలువోలు (చల్లపల్లి): స్థానిక బీసీ కాలనీలో ఈనెల 19న బొల్లా శ్రీనివాసరావు ఇల్లు పూర్తిగా కాలిపోయింది. రెడ్ క్రాస్ జిల్లా శాఖ సమకూర్చిన వంట పాత్రలు, టార్పాలిన్, రెడ్ క్రాస్ చల్లపల్లి సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో 25 కిలోల బియ్యంను తహసీల్దార్ కె.గోపాలకృష్ణ చేతుల మీదుగా శుక్రవారం అందచేశారు. రెడ్ క్రాస్ చల్లపల్లి శాఖ చైర్మన్ నడకుదురు గోపాలకృష్ణ, ట్రెజరర్ ఎండీ.ఏ.కే.జిలానీ, వీఆర్వో కోటేశ్వరరావు నాయకులు పాల్గొన్నారు.

టోల్ చార్జీల వసూలు తగదు

బంటుమిల్లి: బందరు–బంటుమిల్లి మధ్య రాకపోకలు చేసే బస్సుల్లో ప్రయాణికుల వద్ద టోల్ గేట్ పేరుతో అదనంగా రూ. 10 వసూలు చేయడం తగదని సీపీఎం నాయకులు అన్నారు. టోల్‌గేట్ చార్జీల వసూలును వెంటనే నిలిపివేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సత్యనారాయణమూర్తికి వినతిపత్రం అందజేశారు. సీపీఎం, సీఐటీయూ, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు

అవనిగడ్డ: మత్స్యకారుల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుతో కలిసి శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాగాయలంక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని ఒక్కో మత్స్యకార గ్రూపునకు రూ.2లక్షలు అందిస్తున్నామని చెప్పారు. కేడీసీసీ బ్యాంక్ రూ.10వేల కోట్ల ఆదాయ మైలురాయిని దాటడం సంతోషంగా ఉందన్నారు. మత్స్యకారులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు 24 వేల మంది మత్స్యకారులకు సంవత్సరానికి రూ.10 వేల చొప్పున అందించనున్నామని చెప్పారు. ఫిష్ ఆంధ్రా పథకం ద్వారా ఒక కోటి రూపాయలు మత్స్యకార లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. చల్లపల్లి, నాగాయలంక, మోపిదేవిలో కేడీసీసీ బ్యాంకుకు సొంత భవనాల నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని చెప్పారు. కేడీసీసీ బ్యాంకుల విస్తరణలో భాగంగా లాకర్లు, గిడ్డంగులు, పెట్రోల్ బంకులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న నాగేశ్వరరావు, చిత్రంలో సింహాద్రి రమేష్‌బాబు

కేడీసీసీ బ్యాంకును బలోపేతం చేసేందుకు ఒక కోటి రూపాయలు నాబార్డు నిధులతో నాగాయలంకలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించనున్నామని చెప్పారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ కేడీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో మత్స్యకారుల అభివృద్ధికి రూ.6 కోట్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని జిల్లాలో తొలిసారిగా నాగాయలంకలో చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ అవనిగడ్డ, నాగాయలంక మండల కన్వీనర్లు రేపల్లె శ్రీనివాసరావు, భోగాది వెంకట శేషగిరిరావు పాల్గొన్నారు.

5న కావడి సేవ

మచిలీపట్నంటౌన్: సుబ్రహ్మణ్యస్వామి వారి తైపూసం కావడి సేవ నగరోత్సవం ఫిబ్రవరి 5వ తేదీ ఉదయం ఆరు గంటలకు జరుగుతుందని నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తికేయ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ సెంటర్‌లోని విఘ్నేశ్వరస్వామి ఆలయం నుంచి కావడిసేవ ప్రారంభమవుతుందన్నారు.

నేడు నాబార్డ్ చైర్మన్ షాజి పర్యటన

నాగాయలంక: కృష్ణా జిల్లా కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఆధ్వర్యంలో చేపట్టిన పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నాబార్డ్ చైర్మన్ కేవీ షాజీ శనివారం నాగాయలంకలో పర్యటిస్తారని స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు ముమ్మారెడ్డి వెంకట సాంబశివరావు, బ్యాంక్ బ్రాంచి మేనేజర్ బి.వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఆయన బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, స్థానిక ఎంఎల్ఏ సింహాద్రి రమేష్‌బాబుతో కలిసి రూ.101.81 లక్షలతో చేపట్టే కేడీసీసీ బ్రాంచి నూతన భవనం శంకుస్థాపన, రూ.60.9 లక్షలతో నిర్మించే పీఏసీఎస్ షాపింగ్ కాంప్లెక్స్ భూమి పూజ కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు. అనంతరం ఫిష్ ఆంధ్ర పథకం కింద 256 గ్రూపులకు రుణమేళా, కేడీసీసీ బ్యాంక్ రూ.10 వేల కోట్ల టర్నోవర్ అధిగమించిన సందర్భంగా బ్రోచర్ల ఆవిష్కరణ జరుగుతాయని వివరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, మంత్రులు, కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తన్నీరు నాగేశ్వరరావు తదితరులు పాల్గొంటారని చెప్పారు.

రైతు బజారులో న్యాయ విజ్ఞాన సదస్సు

చిలకలపూడి(మచిలీపట్నం): ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. స్థానిక రైతుబజారులో వ్యాపారులకు న్యాయవిజ్ఞాన సదస్సు శుక్రవారం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ పేదలు, న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని వారికి క్షేత్రస్థాయి నుంచి సుప్రీం కోర్టు వరకు ఉచిత న్యాయ సహాయాన్ని అందించే ఏర్పాటు చేశారన్నారు. సమస్య వచ్చినప్పుడు తమకు తెలియజేసి సంబంధిత పత్రాలను అందజేస్తే న్యాయవాదిని ఏర్పాటు చేసి సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని వివరించారు. సదస్సులో న్యాయవాది చీలి మునలయ్య, ఎస్టేట్ ఆఫీసర్ అమీర్ పాల్గొన్నారు. అనంతరం రైతు బజారులోని స్టాల్స్‌ను ఆయన పరిశీలించి దళారీ వ్యవస్థపై ఆరా తీశారు. వినియోగదారులకు నిబంధనల మేరకు కూరగాయలు విక్రయించాలని సూచించారు.

మినుములో ఎండు తెగులును నియంత్రించండి

పెడన: మినుము పైరులో ఎండుతెగులు నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని పెడన వ్యవసాయ శాఖాధికారి జీవీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన పెడన మండలం నందిగామలో మినుము పైరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎండుతెగులును గుర్తించామన్నారు. ఎండుతెగులు నిల్వ ఉన్న నీటి వల్ల, వర్షం నీటి వల్ల సులభంగా వ్యాప్తి చెందుతుందని చెప్పారు. తెగులు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో వీఏఏ ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

మహా శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిద్దాం

తహసీల్దార్ రామకోటేశ్వరరావు

కృత్తివెన్ను: మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తహసీల్దార్ రామకోటేశ్వరరావు అన్నారు. మహా శివరాత్రి ఉత్సవాలపై శుక్రవారం కృత్తివెన్ను శివాలయ అభిషేక మండపంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఫిబ్రవరి 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకు కృత్తివెన్నులోని దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి దేవస్థానంలో ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ పట్టపు నాగేశ్వరరావు తెలిపారు. సమావేశంలో ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మోజీ, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

తీరప్రాంత గ్రామాల్లో ఆపద మిత్రలకు శిక్షణ

పెదకళ్లేపల్లి(మోపిదేవి): నదీ పరివాహక ప్రాంతాల్లో విపత్తుల సమయంలో ప్రజలను కాపాడేందుకు యువత నైపుణ్యం కలిగి ఉండాలని ఎస్‌డీఆర్‌ఎఫ్ ప్రతినిధి డీటీఎం ఎ. ధర్మరాజు అన్నారు. పెదకళ్లేపల్లి కృష్ణానది ఒడ్డున శుక్రవారం ఆపద మిత్రలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నదిలో సహాయక చర్యలు అందించేందుకు ఎస్‌డీఆర్‌ఎఫ్ వినియోగించే అన్ని పరికరాలపై అవగాహన కల్పించారు. అనంతరం నదిలో స్విమ్మింగ్ స్కిల్స్, స్విమ్మింగ్ షైల్స్, లైఫ్ సేవింగ్ టెక్నిక్స్, నీటి అడుగు భాగంలో చిక్కుకున్న వారిని సైతం గుర్తించి కాపాడే పరికరాల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. గ్రామ సర్పంచ్ అరజా సంధ్యారాణి, ఎంఈఓ, ఈఓపీఆర్డీ బూచేపల్లి అశోక్, ఓటీ వెంకటరత్నం, గ్రామ కార్యదర్శి పేర్ని మాధవేంద్రరావు, వీఆర్వో రమణ పాల్గొన్నారు.



